# 60 హక్కుల సాధన సింగరేణి చరిత్రలో రికార్డు



శాంతిఖని గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్

- టీబీజీకేఎస్ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్

బెల్లంపల్లి, డిసెంబర్ 14: బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చొరవతో టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో 60కి పైగా హక్కులు సాధించామని సింగరేణి చరిత్రలో ఇది రికార్డు అని టీబీజీకేఎస్ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్ స్పష్టం చేశారు. పట్టణంలోని శాంతిఖని గని ఆవరణలో గని పిట్ కార్యదర్శి దాసరి శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన గేట్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సాధించిన హక్కులను పోగొట్టిన ఘనత జాతీయ సంఘాలు ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీకే దక్కుతుందని విమర్శించారు. డిపెండెంట్ ఉద్యోగాలను పోగొట్టి సింగరేణి కార్మిక బిడ్డలకు అన్యాయం చేసిన జాతీయ సంఘాలు సింగరేణి గుర్తింపు సంఘంఎన్నికల్లో ఓట్లు అడగడానికి కార్మికుల వద్దకు రావడం సిగ్గు చేటని ఆరోపించారు. తమ సంఘం ఆధ్వర్యంలో కారుణ్య నియమాకాల ద్వారా కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇప్పించామని గుర్తు చేశారు. ఏఐటీయూసీ హయాంలో గోల్డెన్ షేక్ హ్యాండ్ ద్వారా 24 వేల మంది కార్మికులను తొలగించిందని, వారు ప్రస్తుతం దుర్భర పరిస్థితి అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 7 వేల మంది కార్మికులను డిస్మిస్ చేశారని ఆరోపించారు. వెయ్యి మందికి పైగా డిస్మిస్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకున్న ఘనత తమ సంఘానికే దక్కుతుందని వెల్లడించారు. టీబీజీకేఎస్ సంఘం తీసుకువచ్చిన పథకాలు, జాతీయ సంఘాలు పోగొట్టిన పథకాలతో త్వరలో పోస్టర్లు విడుదల చేస్తామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ హయాంలోనే లాభాల వాటాను 14 శాతం నుంచి 32 శాతానికి పెంచిన ఘనత కేసీఆర్‌దేన్నారు. కార్మికుల ఇళ్లకు ఏసీ సౌకర్యం, ఉచిత విద్యుత్, రూ.10 లక్షల రుణం, సంక్రాంత్రి, క్రిస్మస్, రంజాన్ పర్వదినాల్లో పీహెచ్‌డీ సౌకర్యం, కార్పొరేట్ వైద్యం తెలంగాణ ఇంక్రిమెంట్ చెల్లించడం, నామమాత్రపు రూ. 100 రుసుముతో రెండవ డెలివరీకి అవకాశం కల్పించడం, ఇతర ఎన్నో వసతులు కల్పించారని గుర్తు చేశారు. కరోనా కాలంలో కార్మికులకు అండగా నిలిచిందన్నారు. కోలిండియాలో లేని సౌకర్యాలను సింగరేణిలో కల్పించామని తెలిపారు. కార్మికుల హక్కుల సాధనలో ఎక్కడా కూడా సంఘం రాజీ పడలేదని స్పష్టం చేశారు. నిరసన కార్యక్రమాలు చేపట్టి బొగ్గు బ్లాకులకు టెండర్లు వేయకుండా అడ్డుకున్నామన్నారు. మందమర్రి ఏరియాలో తొమ్మిది ప్రైవేట్ ఎస్‌డీఎల్ యంత్రాలను పెట్టి కార్మికుల సంఖ్యను తగ్గించడానికి చూసిన యాజమాన్యం కుట్రలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టి అడ్డుకున్నామని తెలిపారు. చిన్నా చితక జాతీయ సంఘాలు చెప్పే మోసపూరిత వాగ్దానాలను కార్మికులు నమ్మవద్దని సూచించారు. సింగరేణిలో గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలు తీసుకువచ్చిన కేసీఆర్ రుణం తీర్చుకునే సమయం ఆసన్నమైందని గుర్తింపు ఎన్నికల్లో బాణం గుర్తుకు ఓటువేసి కేసీఆర్‌కు గిఫ్ట్‌గా ఇద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి వెంకటరమణ, నాయకులు రాజనాల రమేశ్, దాడి రమేశ్, పెద్దపల్లి రాజన్న, సిద్ధంశెట్టి సాజన్, ఆవుల రవికిరణ్, కార్తీక్, లింగాల కిరణ్, కొట్టే రమేశ్, రాజలింగు, దుర్గం అశోక్, క్రాంతి, సాయికృష్ణ, వెంకటేశ్, సూరం మల్లేశ్, ఈర్ల రాజన్న, మీస అంజయ్య, ముత్తే కిష్టయ్య, మైన్ కమిటీ, సేఫ్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు

- ఆర్డీవో హరికృష్ణ



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో హరికృష్ణ

బెల్లంపల్లి, డిసెంబర్ 14: ప్రభుత్వ భూములు కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హరికృష్ణ హెచ్చరించారు. గురువారం స్థానిక కార్యాలయంలోబెల్లంపల్లి డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, మున్సిపల్, పోలీస్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. చాలా చోట్ల ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురువుతున్నదని తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి ఇంటి నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను రెవెన్యూ, పంచాయతీ అధికారులతో కలిసి సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇంటి నిర్మాణం చేపట్టే భవన నిర్మాణ కార్మికులు, మేస్త్రీలను కూడా బైండోవర్ చేయనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో డీఎల్పీవో ఫణిందర్‌రావు, తహసీల్దార్లు సుధాకర్, రోహిత్, దత్తుప్రసాద్, ఇమ్రాన్‌ఖాన్, బికర్ణదాసు, సదానందం, ఎంపీడీవోలు, ఎంపీవోలు, రూరల్ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, డీఏవో శ్రీనివాసరావు దేశ్‌పాండే, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ భుజంగం తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని కాపాడాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కాసిపేట, డిసెంబర్ 14 : మండలంలోని సోమగూడెం(కే) గ్రామ పంచాయతీలోని సర్వే నంబర్ 146/14లో ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడి, పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని, కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సోమగూడెం(కే) గ్రామానికి చెందిన నాయకులు కోరారు. గురువారం కాసిపేట తహసీల్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ప్రభుత్వ భూమిని కేకే ఓసీ పరిధిలో లేకున్నా ఉన్నట్లు నకిలీ పత్రాలను పొందిన వారిపై, కబ్జాకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, మాజీ సర్పంచ్ భూక్యా చందూలాల్, ఉప సర్పంచ్ కనుకుల రాకేశ్, యూత్ నాయకులు అజ్మీరా రాజా, అజ్మీరా రవి, ఇస్లావత్ రాజేశ్వర్, శివసాయి పాల్గొన్నారు.

## కొనసాగుతున్న జేడీఎస్‌ల నిరవధిక సమ్మె



మందమర్రి పోస్టాఫీస్ ఎదుట దీక్షలో జేడీఎస్‌లు

మందమర్రి, డిసెంబర్ 14: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మందమర్రి(కల్యాణఖని) పోస్టాఫీస్ ఎదుట జేడీఎస్‌లు చేపట్టిన సమ్మె, నిరాహార దీక్ష గురువారం మూడవ రోజుకు చేరుకున్నది. కల్యాణిఖని పోస్టాఫీస్ ఎదుట నిరాహార దీక్షలు చేపట్టిన జేడీఎస్‌లు మాట్లాడుతూ గ్రామీణ డాక్ సేవకులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని, ఎనిమిది గంటల పని కల్పించాలని, కమలేశ్ కమిటీ రిపోర్టులను వెంటనే అమలు చేయాలని కోరారు. 12, 24, 36 సంవత్సరాల సర్వీసు గల ఉద్యోగులకు మూడు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, పిల్లల విద్య మెడికల్ ఆరోగ్య బీమా కింద రూ.5 లక్షల గ్రాట్యూటీని పెంచాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరవధిక సమ్మె నిరాహార దీక్షలో జేడీఎస్‌లు శంకర్‌లింగం, భూమయ్య, జాఫ్రూల్లాఖాన్, మంగ, శంకరయ్య, రాజన్న, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచల రామాలయ ఆస్థాన సంగీత విద్వాంసుడిగా రేగళ్ల భూషణ్ శర్మ



సర్టిఫికెట్ అందుకుంటున్న భూషణ్ శర్మ

చెన్నూర్ టౌన్, డిసెంబర్ 14 : చెన్నూర్ పట్టణానికి చెందిన రేగళ్ల భూషణ్ శర్మ భద్రాచలం రామాలయం ఆస్థాన సంగీత విద్వాంసుడిగా మళ్లీ నియమితులయ్యారు. చెన్నూర్‌కు చెందిన స్వర్గీయ రేగళ్ల శ్యామల సత్యనారాయణ కుమారుడు భూషణ్ శర్మ ప్రఖ్యాతిగాంచిన సంగీత విద్వాంసుడుగా పేరు పొందారు. ఆయనకు కర్ణాటక, హిందుస్థాన్ సంగీతాలలో మంచి ప్రావీణ్యం ఉంది. మృదంగ వాద్యంలో పేరుగాంచారు. ఆయన తల్లి కీ.శే. రేగళ్ల శ్యామల ఆల్ ఇండియా రేడియోలో అనేక కార్యక్రమాలు నిర్వహించారు. భూషణ్ శర్మ కూడా అనేక సంగీత కచేరీలు నిర్వహించారు. తబలా, మృదంగం వాయించడంలో ఆయనకు ఆయనే సాటి. ఆయన ప్రతిభను గుర్తించిన భద్రాచల రామాలయం వారు భూషణ్ శర్మను మళ్లీ ఆస్థాన సంగీత విద్వాంసుడిగా నియమించారు. భద్రాచల రామాలయంలో ముక్కోటి ఏకాదశి, అన్నమాచార్యుడి ఉత్సవాలకు, పలు సందర్భాల్లో నిర్వహించే కార్యక్రమాలకు భూషణ్ శర్మ మృదంగం సహకారం అందిస్తుంటారు. మళ్లీ తనను విద్వాంసుడిగా నియమించిన వారికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా భూషణ్ శర్మను జిల్లా ప్రజలు, బంధుమిత్రులు, కళాకారులు అభినందించారు.

## కార్మికుల పక్షాన ఉండి హక్కులను సాధిస్తాం

కాసిపేట, డిసెంబర్ 14 : కార్మికుల పక్షాన ఉండి హక్కులను సాధిస్తామని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సెక్రటరీ రాపర్తి శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల కృష్ణ, మాజీ సహకార చైర్మన్ పూస్కూరి వంశీకృష్ణారావు కార్మికులకు పిలుపునిచ్చారు. గురువారం కాసిపేట మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఐఎన్‌టీయూసీ నాయకులు, కార్మికులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాసిపేట మండలంలో ఉన్న కాసిపేట 1వ గని, కాసిపేట 2 ఇంక్లైన్ గనుల్లో కార్మికులు ఐఎన్‌టీయూసీకి మద్దతు తెలుపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సిద్ధం తిరుపతి, మాజీ సర్పంచ్ ఉత్తూరి సత్తయ్య, నాయకులు నస్పూరి నర్సింగ్, సామ లక్ష్మణ్, మడావి వెంకటేశ్, కోడూరి మునేందర్, తొంగల కుమారస్వామి, నక్క నరేశ్, ఆల్క రాజు, అడిచర్ల రాజేశం, కొత్త రమేశ్, చంద్రయ్య, బలరాం, మధూకర్ తదితరులు పాల్గొన్నారు.

## మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు పాల్గొన్న నాయకులు

కాసిపేట, డిసెంబర్ 14 : కాసిపేట మండలంలోని సోమగూడెం(కే) గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం సర్పంచ్ సపాట్ శంకర్ ఆధ్వర్యంలో కరీంనగర్ సన్ షైన్ హాస్పిటల్, కరీంనగర్ ప్రతిమా కంటి హాస్పిటల్ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మందికి షుగర్, బీపీ, ఈసీజీ, ఆర్థో, కంటి పరీక్షలను వైద్యులు నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఆపరేషన్ అవసరం ఉంటే 50 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు సర్పంచ్ సపాట్ శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దాసరి వెంకటరమణ, డాక్టర్ ప్రవీణ్ కుమార్, పీఆర్‌వో నిఖిలేశ్, ఆర్‌ఐ సులోచన, కార్యదర్శి కొండగొర్ల కీర్తి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### కొత్తపల్లిలో..

వేమనపల్లి, డిసెంబర్ 14 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజేశ్ ఆధ్వర్యంలో గురువారం కొత్తపలిలో వైద్య శిబిరం నిర్వహించారు. ఎన్‌సీడీలో భాగంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ లింగయ్య, ఏఎన్‌ఎం రాజ్యలక్ష్మి, ఆశ కార్యకర్త సుజాత తదితరులు పాల్గొన్నారు.

## స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలని ఆందోళన



ఇందారం ఓసీ వద్ద ఆందోళన చేస్తున్న నిరుద్యోగులు

జైపూర్, డిసెంబర్ 14: శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఇందారం ఓపెన్‌కాస్టు గని ఓబీలో వోల్వో వాహనాలు నడిపించేందుకు స్థానికులకే అవకాశాలు కల్పించాలని కోరుతూ గురువారం ఇందారం బీఆర్‌ఎస్ నాయకులు అరికె సంతోష్ నిరుద్యోగులతో కలిసి ఆందోళన నిర్వహించారు. మట్టిని తరలిస్తున్న వాహనాలను అడ్డుకున్నారు. ఓసీ ఏర్పాటై మూడేళ్ల పూర్తికాగా ఓబీ కాంట్రాక్టర్ మారాడు. ఈ నేపథ్యంలో కొత్తగా వచ్చిన కాంట్రాక్టర్ డ్రైవర్లుగా స్థానికులకు అవకాశం ఇవ్వకుండా రామగుండం, లింగాపురం, ఎన్‌టీపీసీ, మందమర్రి ప్రాంతాలకు చెం దిన వారిని తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఓసీ బ్లాస్టింగ్‌లతో ఇబ్బందులకు గురవుతుండగా ఇతర ప్రాంతాల వారిని ఇక్కడి పనులకు తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయం తెలుసుకున్న ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్ జీఎం సంజీవరెడ్డితో ఫోన్‌లో మాట్లాడి దశల వా రీగా అవకాశాలు కల్పిస్తామని నచ్చజెప్పి పంపించారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

కోటపల్లి, డిసెంబర్ 14 : కోటపల్లి మండలం షట్‌పల్లిలో నిరుపేద ముస్లిం కుటుంబానికి చెందిన వృద్ధురాలు మరణించగా, వారికి సర్పంచ్ ముల్కల్ల ఉమ రూ.2వేల నగదుతో పాటు 25 కిలోల బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పుప్పిరెడ్డి మొండక్క, ఉప సర్పంచ్ గోనె మోహన్ రెడ్డి, నాయకులు వేముల రాజం, పుప్పిరెడ్డి రాంరెడ్డి, ఎండీ సలీం, పుప్పాల సతీశ్, మాదరి సుధాకర్, ఆసంపల్లి రాజం, కాసిపేట రాజన్న, కాపిరపు బాపు తదితరులున్నారు.

## నేడు ప్రజావేదిక

కోటపల్లి, డిసెంబర్ 14 : కోటపల్లిలోని రైతువేదిక ఆవరణలో శుక్రవారం ప్రజావేదికను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కే భాస్కర్ తెలిపారు. కోటపల్లి మండలంలోని జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై తనిఖీల వివరాలను ప్రజావేదికలో వెల్లడిస్తారని వివరించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, ఉపాధి సిబ్బంది పాల్గొనాలని కోరారు.

## సెంట్రల్ సెక్రటరీగా రాపర్తి శ్రీనివాస్

కాసిపేట, డిసెంబర్ 14 : కాసిపేట మండల కేంద్రానికి చెందిన రాపర్తి శ్రీనివాస్ ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సెక్రెటరీగా నియమితులయ్యారు. ఈ మేరకు ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రెటరీ జనక్ ప్రసాద్ నియామక పత్రాన్ని అందించారు. వారికి రాపర్తి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.